సీఎం రిలీఫ్ ఫండ్‌తో నిరుపేదలకు లబ్ధి : ఎమ్మెల్యే


చిన్నారి తండ్రికి సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొత్తపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో సతమతమయ్యే నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేసే సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కొత్తపేట భరత్‌నగర్‌కు చెందిన సంతోష్ రెండేండ్ల కుమారుడు శ్రేయాన్స్ తీవ్ర అనారోగ్యంతో సతమతమయ్యాడు. చిన్నారిని చికిత్స కోసం నిమ్స్‌లో చేర్పించారు. వైద్య ఖర్చుల కోసం వారు ఎమ్మెల్యేని సంప్రదించారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేయడంతో రూ1,70,000లు మంజూరయ్యాయి. సదరు మంజూరు పత్రాన్ని శుక్రవారం ఆయన సంతోష్‌కు అందజేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

వనస్థలిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి డివిజన్ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ జైహింద్ బాబు గల్లీలో రూ.62లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, ఏఈ విగ్నేశ్వరీ, కాలనీ అధ్యక్షుడు జగదీశ్‌కుమార్‌గుప్తా, కార్యదర్శి సంజయ్‌కుమార్, కాలనీవాసులు స్వర్ణమాధవి, సాయికిరణ్ పాల్గొన్నారు.


తాగునీటి పైపులైను పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభం

హయత్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్‌లోని శ్రీరామనగర్‌కాలనీలో రూ.24లక్షలతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ పనులను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనగర్‌కాలనీవాసులు చాలా కాలంగా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారని తెలిపారు. కాలనీలోని నీటి సమస్యలను జలమండలి అధికారులకు చెప్పి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. హయత్‌నగర్ ప్రాంతంలోని అన్ని కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తానని అన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు రమేష్, సక్రునాయక్, నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, గొలుసు శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, అంజయ్య, తొన్నూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.


మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఆర్యవైశ్య మహిళలు

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటుంది

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ నివాసం వద్ద కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మధుయాష్కీగౌడ్ మహిళలకు కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తుందన్నారు. మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, మహాలక్ష్మి క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. నీల విజయలక్ష్మి, వరలక్ష్మి, శ్రీలత, బాలమణి, కవిత, శ్రీదేవి, గాయత్రి, కావ్య, లీలావతి, సుమశ్రీ, అనసూయ, కవితతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల కవిత, నరేష్, రమాకాంత్ పాల్గొన్నారు.

పాడైన అంతర్గత దారులకు మరమ్మతులు చేయండి

కొత్తపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో పాడైన అంతర్గత దారులకు మరమ్మతులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన న్యూనాగోల్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కాలనీల్లో దారుల్లో గుంతలు ఏర్పడ్డాయని, ప్యాచ్‌వర్క్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శ్రీనివాస్, ఏఈ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నింబశాఖ మాల అలంకరణలో దుర్గాదేవి

మన్సూరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా నాగోల్ డివిజన్ పరిధిలోని మన్సూరాబాద్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో ఈనెల 26నుంచి జూలై 24వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారిని నింబశాఖ(వేపాకు)మాలతో ప్రత్యేకాలంకరణ చేయగా ఆలయ అర్చకులు బాలమురళీకృష్ణ వేద మంత్రోచ్చరణల నడుమ పూజలు చేశారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

సెల్ టవర్ నిర్మాణ పనులు నిలిపి వేయించండి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు సాయినగర్ కాలనీవాసులు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇళ్ల మధ్యలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న జీయో సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. కాలనీలో సెల్ టవర్ నిర్మాణం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఎమ్మెల్యేకు తెలిపారు. టవర్ నుంచి వెలుబడే రేడియేషన్ మూలంగా కాలనీలోని పిల్లలు, వృద్ధులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉన్నందున వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయించాలని కోరారు.

విశ్రాంతి గదులను సద్వినియోగం చేసుకోవాలి


విశ్రాంతి గదుల పనులకు శంకుస్థాపన చేస్తున్న జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జలమండలి ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే విశ్రాంతి గదులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం రెడ్‌వాటర్ వద్ద రూ.నాలుగు లక్షలతో జలమండలి ఉద్యోగుల విశ్రాంతి గదులు, అమ్మవారి ఆలయ నిర్మాణపు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రాజ్‌గోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం

● ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్


బస్తీవాసులతో మాట్లాడుతున్న డీసీపీ ప్రవీణ్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతూ.. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు నిరంతరం పోలీసు నిఘా ఉంటుందని ఎల్బీనగర్ జోన్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో గురువారం రాత్రి సుమారు 240 మంది పోలీస్ సిబ్బందితో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలులేని 53 ద్విచక్రవాహనాలు, 2ఆటోలు, రూ.8 వేల విలువ చేసే మద్యం బాటిళ్లు, రూ.19వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు సీజ్ చేశారు. అదేవిధంగా ఆరుగురు అనుమానితులు, ఇద్దరు రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని, కౌన్సెలింగ్ నిర్వహించారు. కాలనీలు, బస్తీలలో అనుమానాస్పద రీతిలో తిరిగేటువంటి అనుమానితుల గురించి వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. పాత నేరస్థుల ప్రవర్తనలో మార్పు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్డన్‌సెర్చ్‌లో ఎల్బీనగర్ అదనపు డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలను గుర్తు చేయండి : రాచపుడి


విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్

కొత్తపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పిల్లలూ ట్రాఫిక్ నిబంధనలను పెద్దలకు గుర్తుచేయాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. శుక్రవారం వనస్థలిపురం ఆటో సాయినగర్ ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి 42 మంది చిన్నారులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. రహదారి భద్రత అవగాహనలో భాగంగా వారికి లెక్చర్‌హాల్‌లో వీడియోలు, రైమ్స్ ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను గుర్తుంచుకోవాలని, తరచూ చర్చించాలని అన్నారు. అనంతరం చిన్నారులు పార్కులో హెల్మెట్లు పెట్టుకుని సైకిళ్లపై తిరుగుతూ సందడి చేశారు. పార్కు గోడలపై ఉన్న చిత్రాలను చూపుతూ ఇన్‌స్పెక్టర్ రాచపుడి, హీరో మోటో కార్ప్ సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ నిబంధనలపై మరింత సమాచారం ఇచ్చారు.

60 మంది మద్యంప్రియులకు డీడీ కౌన్సెలింగ్

వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 60 మంది మద్యంప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో చిల్డ్రన్‌పార్కు లెక్చర్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరమని విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్‌ఓపీ అల్లూరయ్య వారికి వివరించారు.

తెలంగాణ కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రజా నాట్య మండలి రంగారెడ్డి జిల్లా సమితి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి రాము ఆధ్వర్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎన్‌ఆర్‌కాలనీ ఫేజ్-2లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసింహతో పాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ప్రజా నాట్యమండలి జిల్లా ఇన్‌చార్జి ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర సాంస్కృతిక విధానాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారులు ప్రథమ పాత్ర పోషించారని పేర్కొన్నారు. ప్రభుత్వం కళాకారులను గుర్తించి ప్రభుత్వం వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రత్యేక కోటా కింద నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ నెల 30న నిర్వహించనున్న కళాకారుల సదస్సులో జిల్లా కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరిసింగ్‌నాయక్, వేణుగోపాలచారి, మహేందర్, భాస్కర్, శ్రీకాంత్, సావిత్రి, మంగ, శైలజ, మల్లేష్ పాల్గొన్నారు.

భక్తుల మదిలో శ్రీకృష్ణ పరమాత్ముడు: మాడుగుల నాగఫణిశర్మ


భాగవతంలో దశమ స్కంధం ప్రవచన కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ

చంపాపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ పరమాత్ముడు భక్తుల మదిలో అన్ని వేళలు, అన్ని చోట్ల కొలువై ఉంటారని పద్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ సాగర్‌రింగ్‌రోడ్డులోని సువర్ణభారతి గోశాలలో శుక్రవారం తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ నేతృత్వంలో భాగవతంలో దశమ స్కంధంపై ప్రవచనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగఫణిశర్మ హాజరై మాట్లాడుతూ 30సంవత్సరాల కిందట శ్రీకృష్ణునిపై రాసిన పాటను ఆలపించి గుర్తు చేశారు. బంగారయ్యశర్మ మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు గదతో పాటు చక్రం కూడా ధరించేవారని దశమ స్కంధంలో పేర్కొన్నారు. భగవత్ తత్వం ఈ స్కంధంలో పూర్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల అధికారి గీతామూర్తి, భక్తులు టి.రమేష్‌గుప్తా పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేంద్రం భాగస్వామ్యం ఉంది


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సరూర్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో కేంద్రం భాగస్వామ్యం ఉన్నదని, కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని తన సొంత పథకంగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని బీజేపీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరిగి సర్టిఫికెట్లు పంపిణీ చేయడం, నిర్మాణానికి ముగ్గుపోసి శంకుస్థాపన చేయడం వారి స్వార్థ రాజకీయానికి నిదర్శనమని వారు ఆరోపించారు. ఈ పథకంలో కేంద్రం వాటా కూడా ఉన్నట్టు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపైనా ఉన్నదని, సర్టిఫికెట్లు కాంగ్రెస్ నాయకుల చేతిలో పెట్టడం సరైన పద్ధతి కాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ బడంగ్‌పేట్ శాఖ-12 అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి పార్టీ నేతలతో కలిసి మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం ప్రకాశ్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, రేసు నర్సింహారెడ్డి, సైదులు, తోట అమరేందర్‌రెడ్డి, క్యారగారి అరవింద్, ప్రవీణ్‌గౌడ్, అంగల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చైతన్యకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు రాజ్‌కమల్ మహారాజ్, నేతలు సైదులు, పరుశరాం, బాబు, వెంకటేష్, బాలు, మూర్తి తదితరులు.

\- సైదాబాద్, ఆంధ్రజ్యోతి

గోదాం పై నుంచి పడి కార్మికుడి మృతి


మల్లేష్(ఫైల్)

హయత్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): విత్తనాల గోదాం పై కప్పు మార్చుతుండగా ప్రమాదవషాత్తు కింద పడి కార్మికుడు మృతిచెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొహెడా గ్రామానికి చెందిన పొట్ట చెరువు మల్లేష్(55) శుక్రవారం కొహెడాలోని జీనియస్ విత్తనాల గోదాం పై కప్పును మార్చుతుండగా ప్రమాద వషాత్తు పై నుంచి కింద పడి తీవ్ర గాయాలకు గురి అయ్యాడు. వెంటనే మల్లేష్‌ను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధం విధించినా కొనసాగుతున్న గేమ్స్ బెట్టింగ్


సమావేశంలో మాట్లాడుతున్న అభయ్ రాజ్‌మిశ్రా

పంజాగుట్ట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆన్‌లైన్ రియల్ మనీ గేమ్స్‌పై పూర్తిస్థాయి నిషేధం విధించడంతో ఆఫ్ షోర్ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినోలు విపరీతంగా లబ్ధి పొందుతున్నాయని, ఇది దేశీయ గేమింగ్ పరిశ్రమను చంపుతోందని తమ అధ్యయనంలో వెల్లడైందని పబ్లిక్ రెస్పాన్స్ ఎగైనెస్ట్ హెల్ప్‌నెస్ అండ్ యాక్షన్ ఫర్ రిడ్రెస్సల్(ప్రహార్) సంస్థ అధ్యక్షుడు అభయ్ రాజ్‌మిశ్రా అన్నారు. శుక్రవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లిక్. బెట్. రిపీట్: కన్స్యూమర్ సర్వే ఆన్ ఫోర్సెస్ డ్రైవింగ్ ఆన్‌లైన్ బెట్టింగ్ అండ్ గ్యాంబ్లింగ్ ఇన్ తెలంగాణ పేరిట తాము ఇటీవల అధ్యయనం చేశామని, రియల్ మనీ గేమింగ్‌లో పాల్గొనే 2,671 మందితో మాట్లాడడం జరిగిందని తెలిపారు. వాటిని క్రోడీకరించి ఒక నివేదికను రూపొందించామన్నారు. తెలంగాణలో రియల్ మనీ గేమింగ్ చట్టవిరుద్ధమని 96 శాతం మంది వినియోగదారులకు తెలుసు, అయినప్పటికీ ఇప్పటికీ ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్, క్యాసినో బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. దాదాపు 87 శాతం మంది ప్రతి రోజూ ఆడుతున్నారని తెలిపారు. త్వరగా డబ్బు సంపాదించడం, వినోదం వంటి అంశాలు ఈ బెట్టింగ్‌కు ప్రధాన ప్రేరకాలుగా నిలుస్తున్నాయని అన్నారు. యువత, మహిళలు ఆటలు ఆడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ దక్షిణ భారత కన్వీనర్ మగేశ్వరన్, రాష్ట్ర ఇన్‌చార్జి డి.లక్ష్మణ్ యాదవ్, డి.భారతి పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్ సీటులో కూర్చున్న మతిస్థిమితం లేని వ్యక్తి

● బస్సు స్టార్ట్ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు


గుర్తు తెలియని వ్యక్తిని ఆలేటి ఆశ్రమానికి అప్పగించిన పోలీసులు

హయత్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగా లేని గుర్తు తెలియని వ్యక్తి డ్రైవర్ సీటులో కూర్చుని బస్సును స్టార్ట్ చేయడానికి ప్రయత్నించిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు హయత్‌నగర్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు బస్టాండ్‌లో నిలిపారు. డ్రైవర్, కండక్టర్ ఇద్దరు కలిసి టీ తాగడానికి కొంత దూరం వెళ్లారు. అదే సమయంలో ఓ గుర్తు తెలియని(40) సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బస్సు ఎక్కి డ్రైవర్ సీటులో కూర్చుని బస్సును స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. ప్రయాణికులు చూసి ఆందోళనకు గురై కేకలు వేశారు. ప్రయాణికులు 100 కు ఫోన్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని గుర్తు తెలియని వ్యక్తిని పట్టుకున్నారు. సదరు వ్యక్తికి సరిగా మతిస్థిమితం లేదని పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆలేటి ఆశ్రమానికి తరలించారు. ఆర్టీసీ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానగర్ నాలాల ఆక్రమణలపై హైడ్రా చర్యలు

● స్వచ్ఛందంగా తొలిగించుకుంటామని బాధితుల వినతి

● వెనుదిరిగిన హైడ్రా సిబ్బంది


నాలా విస్తరణ పనులు చేపడుతున్న హైడ్రా అధికారులు

సైదాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లో నాలాలపై ఆక్రమణలను తొలగించేందుకు శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు భారీ బందోబస్తుతో వచ్చారు. ముందుగా ప్రైవేటు వ్యక్తి ఖాళీ స్థలంలో కుచించుకుపోయిన నాలాలో మట్టి తొలగించి విస్తరించారు. నాలాలపై ఉన్న ఆక్రమణలను గడువు ఇస్తే తాము స్వచ్ఛందంగా తొలగిస్తామని కాలనీవాసులు కోరడంతో హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్ అంగీకరించి వెనుదిరిగారు. చంపాపేట కృష్ణానగర్, బాలాజీనగర్, ఆదర్శనగర్, సింగరేణికాలనీల్లో నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా సమీప కాలనీలు వరదతో ముంచెత్తుతున్నాయి. దీంతో వరద కాలువ నాలా వెడల్పు పనులకు 2017 జీహెచ్‌ఎంసీ రూ.6 కోట్లు మంజూరు చేసి టెండర్ ఖరారు చేసింది. కానీ నాలాపై ఆక్రమణ తొలగింపుకు అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో సదరు కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణల తొలగింపుకు ఉపక్రమించారు. కాలనీవాసుల అభ్యర్థనతో తాత్కాలికంగా వాయిదా పడింది.

తెలంగాణ వీరభద్రీయ సంఘం సంక్షేమానికి కృషి

చాదర్‌ఘాట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వీరభద్రీయ సంఘం సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని సంఘం నూతన అధ్యక్షుడు చెవ్వ కొండయ్య అన్నారు. సంఘం కేంద్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆయన శుక్రవారం ప్రకటించారు. మూసారాంబాగ్‌లోని తెలంగాణ వీరభద్రీయ సంఘం కేంద్ర కమిటీ కార్యాలయంలో ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంఘం అనుబంధ సంఘాల ప్రతినిధులు కొత్తగా కమిటీని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాటపల్లి బిక్షపతి, మిట్టపల్లి పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా చెవ్వ శ్రీనివాస్, కోశాధికారిగా కాటపల్లి రవికుమార్‌తో పాటు సంఘం ప్రతినిధులు ఉన్నారు. త్వరలో సంఘం పూర్తి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని అధ్యక్షుడు చెవ్వ కొండయ్య తెలిపారు.

న్యూమారుతీనగర్‌లో పోలీస్ పెట్రోలింగ్ పెంచండి

కొత్తపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): న్యూ మారుతీనగర్‌లో రాత్రి పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీరంకి రవి, కార్యదర్శి ప్రభాకర్ చైతన్యపురి పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావుకు విన్నవించారు. శుక్రవారం ఆయన కాలనీ ప్రతినిధులతో పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓను కలిసి సమస్యలను వివరించారు. ఇటీవల కాలనీ రోడ్డు నెం.10లో రాత్రి ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురయిందని, బైకుల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ దొంగిలిస్తున్నారని తెలిపారు. కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నామని, గుర్తు తెలియని వ్యక్తులు రాత్రివేళ కాలనీ దారుల పక్కన బైకులపై కూర్చుని అసభ్యంగా ప్రవర్తిస్తూ కాలనీవాసులకు ఇబ్బంది కలుగజేస్తున్నారని విన్నవించారు. పోలీస్ పెట్రోలింగ్ రోజూ చేపట్టాలని, భద్రతపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సెక్టర్ ఎస్‌ఐ భద్రయ్యకూ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షులు రవికేశవ్, మహేష్ దయామా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. శంకర్, సత్తయ్య, హరిప్రసాద్, సదానంద్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

హయత్‌నగర్ : హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవ వాల్ పోస్టర్‌ను శుక్రవారం హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్, నాయకులు నక్క రవీందర్‌గౌడ్, చెన్నగోని శ్రీధర్‌గౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రామగిరిగుట్ట చుట్టు గిరి ప్రదర్శన చేస్తున్న చైర్మన్ జైపాల్‌రెడ్డి, భక్తులు

పసుమాముల రామగిరి గుట్టపై గిరి ప్రదర్శన

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని రామగిరి గుట్ట సీతారామచంద్రస్వామి ఆలయ గిరి ప్రదర్శనకు భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. మూడు నెలల క్రితం శ్రీరామ నవమి రోజు ఇక్కడ గిరి ప్రదర్శనను ఆలయ చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, పాలకవర్గం సమక్షంలో ప్రారంభించారు. ఆలయంలోని మూల విరాట్ శ్రీరాముని జన్మనక్షత్రం ప్రకారం ప్రతి నెల పునర్వసు నక్షత్రం రోజున గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ జైపాల్‌రెడ్డి తెలిపారు. ప్రతి నెల గ్రామంతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి గిరి ప్రదర్శన చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మిసెస్ ఆసియా వరల్డ్-2025 విజేత రేవతి


డాక్టర్ రేవతి

హిమాయత్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : యుఎస్‌తోపాటు భారత్‌లో 16 ఏళ్లకు పైగా సామాజిక సేవ, మహిళా సాధికారత, ప్రపంచ మానవతా విలువల కోసం కృషి చేస్తున్నందుకుగాను 'మిసెస్ ఆసియా వరల్డ్ -2025' కిరీటాన్ని నగరానికి చెందిన డాక్టర్ సూర్యరేవతి దక్కించుకున్నారు. ఈ విషయాన్ని మానస్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సూర్యరేవతి మెట్టుకూరు శుక్రవారం తెలిపారు. ఈనెల 22న దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ కార్యక్రమంలో ఈ అరుదైన గౌరవం దక్కిందన్నారు.

నేడు అవగాహన ఒప్పందం

అల్వాల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తెలంగాణ, ఆంధ్రా సబ్‌ఏరియా ప్రధాన కార్యాలయంలో హెచ్‌ఎండీఏ అధికారులు, డిఫెన్స్ అధికారులు శనివారం ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. రెండు ఎలివేటెడ్ కారిడార్లు... శామీర్‌పేట్- ప్యారడైజ్- డైరీఫామ్ రోడ్డు- మేడ్చల్ వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్‌కు కీలకమైంది. 160 ఎకరాల(డిఫెన్స్) రక్షణ భూమిని సేకరించేందుకు 330 ఎకరాల ప్రభుత్వ భూమిని బదిలీ చేయనుంది. రక్షణ మంత్రిత్వశాఖ(ఎంవోడీ) ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పనులు నిర్వహిస్తారు. ఈ భూమి అప్పగింత పూర్తయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని ప్రారంభించనుంది.